

పోషణ పక్వాడ కార్యక్రమాల షెడ్యూల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

## చిన్నారుల పెరుగుదలపై పర్యవేక్షణ చేయాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ**

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 11 : నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పోషణ పక్వాడ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు చేపట్టనున్న పోషణ పక్వాడ కార్యక్రమాల షెడ్యూల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంక్షేమశాఖ అధికారులకు సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారుల పెరుగుదలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, ఉపాధిహామీ పథకం పనులకు లేబర్ మొబలైజేషన్, అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లుల చెల్లింపు, వృద్ధాప్య పింఛన్లు, రాజీవ్ యువ వికాసం, తదితర అంశాలపై గృహ నిర్మాణ శాఖ, డీఆర్డీవో, డీఈవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో కలెక్టర్ వీసీ నిర్వహించి మాట్లాడారు. కాటారం డివిజన్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విచారణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి పనులకు పెద్దఎత్తున లేబర్‌ను మొబలైజ్ చేయాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు ఆయా కులాల వారీగా రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు ఆన్‌లైన్ చేయడంతోపాటు రసీదు ఇవ్వాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులకు నిధులు చెల్లించేందుకు సోమవారం వరకు బిల్లులు అందజేయాలని పీఆర్, గిరిజన, టీడబ్ల్యూ ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డీపీవో నారాయణరావు, డీఆర్డీవో నరేశ్, పరిశ్రమలశాఖ జీఎం సిద్దార్థ, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శైలజ, సునీత, డీఈవో రాజేందర్, గృహ నిర్మాణశాఖ పీడీ లోకిలాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వ్యాధినిరోధక టీకాలపై జూమ్ మీటింగ్

ములుగురూరల్, ఏప్రిల్ 11 : ములుగు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లతో డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు వ్యాధి నిరోధక టీకాలపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలలో వారం రోజులపాటు నిర్వహించాలని తెలిపారు. టీకాలు వేసుకోలేని పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వేయాలని అన్నారు. డాక్టర్ రణధీర్, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ పవన్‌కుమార్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పూర్ణ సంపత్‌రావు, డీడీఎం ప్రవీణ్ పాల్గొన్నారు.

**ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల సందర్శన**

ములుగు, జాకారంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో గోపాల్‌రావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ జితేందర్, నవ్య, సూపర్‌వైజర్ దేవమ్మ, సిబ్బంది తిరుమల, నరసమ్మ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## పరిమితికి మించి ప్రయాణం



కిక్కిరిసి ప్రయాణిస్తున్న ప్రజలు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 11 : ఏజెన్సీ మారుమూల ప్రాంతంలో బస్సు సౌకర్యం సమయానికి లేకపోవడంతో ప్రమాదమని తెలిసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూలీలు, ప్రజలు ప్రయాణం చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న క్రమంలో ప్రమాదాలు జరిగి కొందరు మృత్యువాత పడుతుండగా మరికొందరు గాయాలపాలవుతున్నారు. ఇలాంటి వాహనాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**కావలెను**

★ హన్మకొండ చౌరస్తాలోని మందుల షాప్ లో పని చేయుటకు సేల్స్‌మెన్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను EXP 2 సం॥ అనుభవం కలవారికి ప్రాధాన్యత సెల్. 8008682125,జీవన్‌లాల్ & సన్స్ మెడికల్ స్టోర్స్ మెయిన్ రోడ్ చౌరస్తా హన్మకొండ.

NTW-000

**PLOT FOR SALE**



★Jangaon DTCP Open Plots Reasonable Price, Clear Title, Prime Location by: SSVPD'S. 7382126789.

NT-329249

**PLOT FOR SALE**

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.

NT-329891

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# దళితులమనే మా ఇండ్లు కూల్చారు

- 200 మంది పోలీసులతో వచ్చి ఇండ్లను నేలమట్టం చేశారు
- మీడియాతో గోడు వెళ్లబోసుకున్న గడ్డిగానిపల్లి దళిత కుటుంబాలు



కూల్చిన ఇండ్ల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న గ్రామస్తులు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 11 : దళితులమనే కారణంతోనే తాము నివసించడానికి తమ పట్టా భూముల్లో ఇండ్లు నిర్మించుకుంటే మున్సిపల్, సింగరేణి, రెవెన్యూ అధికారులు అర్ధరాత్రి వచ్చి జేసీబీలతో పూర్తిగా కూల్చివేశారని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గడ్డిగానిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గడ్డిగానిపల్లి గ్రామస్తులు మీడియాతో తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డిగానిపల్లి గ్రామస్తులు సెగ్గం సిద్దు, చల్లూరి సమ్మయ్య మాట్లాడుతూ.. 2008లో సింగరేణి సంస్థ కేటీకే ఓసీ–2 కింద గడ్డిగానిపల్లి గ్రామంలోని భూములను పూర్తిగా తీసుకొని, గడ్డిగానిపల్లి గ్రామాన్ని ఇక్కడి నుంచి వేరే చోటుకు తరలిస్తామని ఒప్పందం చేసుకున్నదన్నారు. ఇక్కడ ఇప్పటివరకు నిర్మించిన ఇండ్లకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తామని, ఇకమీదట ఇండ్లు కట్టవద్దని, కట్టిన ఇండ్లకు నష్టపరిహారం ఇవ్వమని నాటి నుంచి ఇబ్బందిపెడుతున్నారని, తమ భూములన్నీ సింగరేణి లాక్కున్నదన్నారు. కానీ, 2008 నుంచి ఇప్పటి వరకు సుమారుగా 100 నుంచి 150 మంది యువతీ యువకులకు వివాహాలై వేరే కాపురం కూడా పెట్టుకున్నారని, ఈ క్రమంలో వేరు పడ్డ తమ పిల్లల కుటుంబాలు నివసించడానికి ఇండ్లు ఉండాలని, సింగరేణి స్వాధీన పరుచుకున్న భూముల్లో కాకుండా పక్కకు ఉన్న తమ పట్టా భూముల్లో తమ పిల్లల కుటుంబాలు నివసించడానికి ఇండ్లు నిర్మించుకున్నామన్నారు. ఇది చూసి ఓర్వలేని సింగరేణి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత వచ్చి ఈ ఇండ్లకు పర్మిషన్ లేదని తమను నానా బూతులు తిడుతూ, కూల్చివేస్తుంటే అడ్డుపడిన తమ ఆడవాళ్లను భయభ్రాంతులకు గురి చేవారని అన్నారు. 200మంది బెటాలియన్‌తో నాలుగు జేసీబీలతో సుమారు 60 నుంచి 65 ఇండ్లను నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పట్టా భూముల్లో తాము నివసించడానికి ఇల్లు కట్టుకునే అర్హత తమకు లేదా...? అని అధికారులను ప్రశ్నించారు. తమ కు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఇండ్లను కూల్చివేసే హక్కు మున్సిపల్, సింగరేణి, రెవెన్యూ అధికారులకు ఎవరిచ్చారో తమకు తెలుపాలని డిమాండ్ చేశారు. అధికారులకు దళిత కుటుంబాలంటే ఎందుకంత చిన్న చూపుచూపో అర్థం కావడంలేదన్నారు. సింగరేణి స్వాధీనం చేసుకున్న భూముల్లో కనీసం తాము కాలు కూడా పెట్టలేదని, తమ పట్టా భూముల్లో ఇల్లు నిర్మించుకుంటే కూల్చివేసిన అధికారులు, కూల్చిన ఇండ్లకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, లేకుంటే గడ్డిగానిపల్లి గ్రామాన్ని అసలే ఖాళీ చేయమని హెచ్చరించారు. తమ ఇండ్లకు నష్టపరిహారం చెల్లించకుంటే అతి త్వరలోనే కేటీకే ఓసీ–2 ప్రాజెక్టు వద్ద టెంటు వేసుకొని వంటావార్పు చేస్తూ, ఓసీ– 2లో పనులు జరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడ్డిగానిపల్లి గ్రామస్తులు చల్లూరి లక్ష్మి, గజ్జె పద్మ, గజ్జె సమ్మక్క, జనగామ ప్రభుదాస్, జనగామ చిరంజీవి, సమ్మయ్య, ఆకుదారి లక్ష్మయ్య, ఆనంద్, లక్ష్మయ్య, దేవేందర్‌లతో 50 మంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## మంత్రి గారూ మా మండలానికి ఎప్పుడొస్తరు?

**శ్రీధర్‌బాబును కోరిన బీఆర్ఎస్ నేతలు**

మహాముత్తారం, ఏప్రిల్ 11 : ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు మా మండలానికి ఎప్పుడొస్తారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం యామన్‌పల్లిలో వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు కావొస్తున్నదని, ఒక్కసారైనా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తమ మండలానికి రాకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుందని వారు ప్రశ్నించారు. ఎన్నికల్లో మీకు మండలం నుంచి మెజార్టీ రానందునే మీ నాయకులపై ఇష్టంలేక రావడంలేదన్నారు. మేనిఫెస్టో చైర్మన్‌గా ఉన్న మీరు ఇచ్చిన హామీలు గుర్తుకు రావడంలేదా అన్నారు. కాళేశ్వరం చిన్న కాలువ నీరు తెచ్చి మహాముత్తారం మండలాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ఆ హామీ ఏమైందో తెలుపాలన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్, ప్రతి గ్రామానికి బస్టాప్ నిర్మిస్తామని చెప్పి ఇప్పుడు దాటవేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమ మండలానికి వచ్చి అభివృద్ధి పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామి, మాజీ మండల అధ్యక్షుడు మార్కారావు గౌడ్, మండల అధికార ప్రతినిధి బోడా బాలాజీ నాయక్, శ్రీపతి సురేశ్, అల్లావుద్దీన్, బొబ్బిలి వెంకన్న పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 11 : బార్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించగా, 71 మంది న్యాయవాదులకు 70 మంది ఓటును వినియోగించుకున్నారు. శ్రీనివాస్‌చారికి 46 ఓట్లు రావడంతో నూతన జిల్లా అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్‌రావు, ఉపాధ్యక్షుడిగా బల్ల మహేందర్, జాయింట్ సెక్రెటరీగా ఎస్ రవీందర్, మహిళా జాయింట్ సెక్రెటరీగా జీ ప్రియాంక, లైబ్రరీ సెక్రెటరీగా కే అక్షయ, ట్రెజరర్‌గా ఎం రాజ్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఐ శివకుమార్, సీనియర్ ఈసీ మెంబర్‌గా కే కవిత, బీ రమేశ్‌నాయక్, ఆర్ రాకేశ్, ఎన్ ప్రశాంత్, వీ రవీందర్, ఈసీ ఉమెన్ కే సుధారాణిని ఎన్నుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శబరీష్

## 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

ములుగు, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 22 మంది శుక్రవారం ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో లొంగిపోయిన వారిని చూపించడంతోపాటు వివరాలను వెల్లడించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పోరు కన్న ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి' అనే కార్యక్రమాన్ని ములుగు జిల్లాలో చేపట్టగా హింసాత్మక మార్గాలను వదలి ప్రశాంత జీవనాన్ని గడపాలని నిర్ణయించుకొని మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ముగ్గురు ఏసీఎం సభ్యులతో పాటు పార్టీ సభ్యుడు, మరో 18మంది ఆర్‌పీసీ కమిటీకి చెందిన మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం యాకన్నగూడెం గ్రామానికి చెందిన మడవి మాస ఏసీఎం హోదాలో లొంగిపోయాడన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మల్లంపేట గ్రామానికి చెందిన ముచ్చకి జోగారామ్ అలియాస్ జోగా పామెడ్ ఏరియా కమిటీలో ఏసీఎం హోదాలో పనిచేస్తున్నాడని వివరించారు. అదే రాష్ట్రం, అదే జిల్లా తుమ్మిరిగూడ గ్రామానికి చెందిన తాటి జోగా పూవ్వార్తి ఎస్‌వోఎస్ డిప్యూటీ కమాండర్‌గా ఏసీఎం హోదాలో పనిచేస్తూ లొంగిపోయాడని వివరించారు. వీరితో పాటు మావోయిస్టు పార్టీ సభ్యుడు పూనెం సుక్కు, మావోయిస్టు పార్టీ కొత్తపల్లి రాంపూర్ సర్కార్ కమిటీ అధ్యక్షుడు కోరం పాపారావు, కమిటీ సభ్యులు రౌతు హనుమయ్య, హనుమ మడవి, వెట్టి వెంకన్న, మాసపోడి, మడకం దేవా, మడవి జోగా, బీరబోయిన నారాయణ, సోడి మాసు, దూడి జయరామ్, మజ్జి విజయ్, షూరిటీ రవన్న, కొత్తకొండ మజ్జి హైమావతి, కల్లూరి శాంత, కల్లూరి తిరుపతమ్మ, మజ్జి నాగరత్న, మజ్జి తిరుపతమ్మ, మజ్జి సుశీల లొంగిపోయినట్లు ఎస్పీ వివరించారు. వీరంతా మావోయిస్టులకు పోలీసుల సమాచారాన్ని చేరవేయడంతోపాటు వారికి కావాల్సిన బియ్యం, కూరగాయాలు, ఇతర వస్తువులను చేరవేసే వారని ఎస్పీ పేర్కొన్నారు. అజ్ఞాతంలో పనిచేస్తున్న మావోయిస్టు నాయకులు స్వచ్ఛందంగా లొంగిపోయి కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఆర్పీఎఫ్ పీఎంజీ పంచమీలాల్, డీఎస్పీ రవీందర్, వెంకటాపురం, పస్రా సీఐలు కుమార్, రవీందర్, ఎస్సైలు తిరుపతి, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి భీరమయ్య జాతర

వాజేడు, ఏప్రిల్ 11: టేకులగూడెం జీపీ పరిధి గుట్టపై కొలువుదీరిన భీరమయ్య(భీష్మశంకరుడు) జాతర నేడు ప్రారంభం కానుంది. లొటపిటగండి నేటి నుంచి సోమవారం వరకు జాతర జరగనుంది. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయానికి రంగులు వేశారు. కడెకల్ గ్రామం నుంచి లక్ష్మీదేవర, పెద్దగంగారం గ్రామం నుంచి సారలమ్మ దేవరలు శనివారం సాయంత్రం 5గంటల వరకు లొటపిటగండికి చేరుకోవడంతో జాతర ప్రారంభం అవుతుందన్నారు. కాగా, ఈ జాతరకు ములుగు జిల్లాతోపాటు కరీంనగర్, వరంగల్ జిల్లాలు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది. అత్యంత ప్ర జాదరణ కలిగిన ఈ జాతరను ప్రభుత్వాలు పట్టిం చుకోకపోవడంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ స్వచ్ఛందంగా జాతరను నిర్వహిస్తున్నారు. రాష్ట్రప్రభు త్వం పట్టించుకొని ఇక్కడ సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

## చిన్న కాళేశ్వరం పనుల అడ్డగింత



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, అధికారులు

కాటారం, ఏప్రిల్ 11 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గారెపల్లి నూతన రిజర్వాయర్ వద్ద జేసీబీతో కట్ట మట్టి తొలగించే పనులను భూనిర్వాసిత రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. గత కొన్నేళ్లుగా పరిహారం రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, నష్ట పరిహారం ఇచ్చే వరకు పనులు జరుగనీయమని స్పష్టం చేశారు. నీటి పారుదల శాఖ డీఈఈ ఉపేందర్ రైతులకు నచ్చజెప్పినా వినలేదు. దీంతో తహసీల్దార్ నాగరాజు చేరుకొని త్వరలో సబ్ కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు. ఎస్సై శ్రీనివాస్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. రైతులు మాచర్ల రాజేందర్, తైనేని సతీశ్, పైడాకుల సురేశ్, సంతోష్, రాజయ్య, సత్యం, వినోద పాల్గొన్నారు. అలాగే గుమ్మళ్లపల్లి, గూడూరు గ్రామాల్లో చేపడుతున్న సర్వే, భూసేకరణ అలైన్మెంట్‌ను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సర్వే జరుగుతున్న తీరు, భూ సేకరణ ప్రక్రియను తహసీల్దార్ నాగరాజును అడిగి తెలుసుకున్నారు. సర్వే త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈఈ వెంకన్న, ప్రత్యేక గిర్దావర్లు, సర్వేయర్లు, కాంట్రాక్ట్ సంస్థ నిర్మాణ ప్రతినిధులు ఉన్నారు.





వైద్యులతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు, బాధిత రైతుతో మాట్లాడుతున్న బడే నాగజ్యోతి

## నర్సింహారావును ప్రభుత్వం ఆదుకోవాలి

**బాధిత రైతుకు ప్రముఖుల పరామర్శ**

మంగపేట/ ఏటూరునాగారం, ఏప్రిల్ 11 : ఇటీవల కురిసిన వడగండ్లకు పంట నష్టపోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి హనుమకొండలో చికిత్స పొందుతున్న మొట్లగూడెంకు చెందిన యాలం నర్సింహారావును శుక్రవారం బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి వేర్వేరుగా పరామర్శించారు. నర్సింహారావుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్సింహారావు కుటుంబానికి అండగా ఉంటామని భరసా ఇచ్చారు. 20ఎకరాల్లో పంట కోల్పోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే బాధతోనే నర్సింహారావు ఆత్మహత్యకు యత్నించాడని తెలిపారు. ఈ ప్రభుత్వంపై నమ్మకం లేకనే నర్సింహారావు పురుగుల మందుతాగాడని తెలిపారు. అతని వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి చిత్తశుద్ధి చాటుకోవాలని కోరారు. కోల్పోయిన పంట మొత్తానికి పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, వడగండ్ల వాన వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. లక్ష్మీనర్సింహారావు వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్, జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ తుమ్మల హరిబాబు ఉన్నారు. అలాగే, యాలం నర్సింహారావును హనుమకొండలో మంత్రి సీతక్క పరామర్శించారు. రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

## నేడు కాటారంలో రాజ్యాంగ స్తూపం ఆవిష్కరణ

కాటారం, ఏప్రిల్ 11 : మండలకేంద్రంలో శనివారం బహుజన సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ స్తూపం ఆవిష్కరించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండలాధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు జక్కు శ్రావణ్ తెలిపారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, భూపాలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీరాకేశ్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు, బహుజన నేతలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

టేకుమట్ల, ఏప్రిల్ 11 : మండలంకేంద్రంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ఓనపాకల శ్రావణ్, ఆసిరెడ్డిపల్లిలో మారం లింగారెడ్డి, అంకుశాపూర్‌లో కాటం రాజయ్య ఇటీవల మృతి చెందారు. శుక్రవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వా రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కుటుంబాలను పరామర్శించారు. శ్రావణ్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను పల్లెనిద్రలు చేసినప్పుడు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు శ్రావణ్ ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవాడని గుర్తు చేశారు. శ్రావణ్ కుటుంబాన్ని తన వంతుగా ఆదుకుంటానని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ కార్మికశాఖ మండల అధ్యక్షుడు రామకృష్ణగౌడ్, ఐలయ్య, సురేశ్, సీనియర్ నాయకుడు ఆకోజు వరదాచా రి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సదానందం, తోట సాగర్, కట్ల శ్రీనివాస్, స్వామి, గురుకుంట్ల కిరణ్, జక్కుల కిరణ్, పాల శంకర్, రజనీకాంత్, లింగంపల్లి ప్రభాకర్, చరణ్, నారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ఉన్నారు.



మంటల్లో కాలిపోతున్న గేదెలు

## విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి

ములుగురూరల్, ఏప్రిల్ 11 : విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి చెందిన ఘటన బండారుపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు గేపు శంకర్ ఇంటి ఆవరణలో ఉన్న రేకుల షెడ్‌లో గురువారం రాత్రి రెండు పాడి గేదెలు కట్టేసి మేత వేశాడు. మధ్య రాత్రి సమయంలో షెడ్‌కు ఉన్న విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో షెడ్‌లో మంటలు చెలరేగడంతో గేదెలు విద్యుదాఘాతానికి గురై మంటల్లో కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శంకర్‌ను పరామర్శించారు. నష్టపరిహారం అదేవిధంగా అధికారులతో మాట్లాడుతానని అన్నారు. ఈ మేరకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.

- మహిళల విద్యాభివృద్ధికి కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త
- జయంతి వేడుకల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు





మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, అధికారులు

# మహనీయుడు పూలే

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్/ కృష్ణ కాలనీ/ మహదేవపూర్(కాళేశ్వరం)/ గోవిందరావుపేట/ మంగపేట/ ఏటూరునాగారం/ మహాముత్తారం, ఏప్రిల్ 11 : సామాజిక, సమానత్వ సాధన కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, ములుగు అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఐడీవోసీ, ములుగు సంక్షేమ భవనం, ఆయా జిల్లాల్లో ప్రజా సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లిలో పూలే చిత్రపటానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శైలజ, డీఈవో రాజేందర్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, డీఆర్డీవో నరేశ్ పాల్గొన్నారు. ములుగులో బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు పాల్గొని నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన వేడుకల్లో ప్రజా సంఘాల నాయకులు ముంజాల భిక్షపతి, వడ్డేపల్లి సారంగపాణి, జంపాల రవీందర్, పోరిక రాహుల్‌నాయక్, చంటి భద్రయ్య, సంజీవయ్య, స్వామి, ఇరుగు పైడి పాల్గొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన వెంట నాయకులు పోక్కురి శ్రీనాథ్, వినయ్, తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రామయ్యగౌడ్, అబినాష్‌రెడ్డి ఉన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం వెంకటరామ రెడ్డి హాజరయ్యారు. ఎస్‌వో టు జీఎం కవీంద్ర, ఏజీఎం జ్యోతి, అధికార ప్రతినిధి గుండు రాజు, భూపాలపల్లి సివిల్ ఆఫీసర్ బాలరాజు పాల్గొన్నారు. మహదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే జయంతి, ముందస్తుగా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ బన్సోడ రాణీబాయి, మాజీ సమితి అధ్యక్షుడు ప్రేమానందం, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు. గోవిందరావుపేట మండలకేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి జంపాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించగా నాయకులు భిక్షపతి, మధు, వెంకటకృష్ణ, హరిప్రసాద్, సోమయ్య, సుధాకర్, సీతారామ్‌నాయక్, నాగమణి, శ్రీకాంత్ పాల్గొన్నారు. గణపురం మండలం కేటీపీపీలో సీఈ చిట్టా ప్రగడ శ్రీ ప్రకాశ్ పూలేకు ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆఫీస్ మేనేజర్ శ్రీనివాస్, అకౌంట్స్ మేనేజర్ నర్సింహ, ఉద్యోగులు పాల్గొన్నారు. మహాముత్తారం మండలం యామన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులు పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు వారు పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు మార్క రాముగౌడ్, మండల అధికార ప్రతినిధి బోడ బాలాజీ, మాజీ ఎంపీటీసీ శ్రీపతి సురేశ్, మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామి, అల్లావుద్దీన్, బొబ్బిలి వెంకన్న, పంగ సంపత్, సీత రాజయ్య, సుధాకర్, పోచయ్య, దేవ్‌సింగ్, జనార్దన్, జాడి రాజేశ్, ఆవుల రాజేందర్, సమ్మయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లోనూ దరఖాస్తుల స్వీకరణ

గణపురం, ఏప్రిల్ 11: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను సెలవు రోజుల్లో కూడా స్వీకరించనున్నట్లు ఎంపీడీవో ఎల్ భాస్కర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యువత రెండో శనివారం, ఆదివారం, సోమవారం (అంబేద్కర్ జయంతి) కూడా ఎంపీడీవో కార్యాలయంలో పత్రాలు అందించవచ్చని సూచించారు.

## వే బ్రిడ్జి నిర్వాహకుల హల్‌చల్

**రహదారి అడ్డగించి కాంటా వైపు లారీల మళ్లింపు**

మహదేవపూర్,ఏప్రిల్ 11 : మండలంలోని బొమ్మాపూర్ ఇ సుక క్వారీ వద్ద ఏర్పాటు చేసిన ప్రైవేట్ వే బ్రిడ్జి నిర్వాహకులు హల్‌చల్ సృష్టిస్తున్నారు. ఇసుక క్వారీ వద్ద టీజీఎండీసీ ఆధ్వర్యం లో వే బ్రిడ్జి నిర్వహిస్తున్నారు. గతంలో ప్రైవేట్ వే బ్రిడ్జి ఏర్పాటు కోసం పలువురు ప్రయత్నించగా సంబంధిత అధికారులు నిరాకరించారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు టీజీ ఎండీసీ వే బ్రిడ్జి స మీపంలోనే ప్రైవేట్ వే బ్రిడ్జిని ఏర్పాటు చేసి రహదారికి అడ్డంగా ద్విచక్ర వాహనాలను నిలిపి ఇసుక లారీలను దారి మళ్లిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన గ్రామానికి చెందిన యువకులను సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ తతంగంలో టీజీ ఎండీసీ అధికారులు హస్తం ఉన్నట్లు వారు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వే బ్రిడ్జిల నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

గణపురం, ఏప్రిల్ 11 : మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన పోలు రమేశ్ మద్యం సేవించి వాహనం నడిపినందుకు భూపాలపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్ రామచందర్‌రావు ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ వాహనాల తనిఖీలో పట్టుపడగా రమేశ్‌ను కోర్టులో హాజరుపర్చామన్నారు. దీంతో జడ్జి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

కాటారం, ఏప్రిల్ 11 : మండలంలోని ఇబ్రహీంపల్లి జీపీ పరిధిలోని పోతుల్వాయి గ్రామానికి చెందిన చల్ల దేవేందర్ (26) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దేవేందర్ తండ్రి నాలుగేళ్ల క్రితమే మృతి చెందాడు. ఆటో నడుపుతున్న అతడు వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా జల్సాలకు అలవాటు పడ్డాడు. దీంతో కుటుంబాన్ని ఎలా వెళ్లదీయాలని తల్లి దేవేందర్‌ను మందలించింది. ఈ క్రమంలో మద్యం మత్తులో క్షణికావేశానికి లోనైన అతడు ఈ నెల 5న ఇంటి వద్ద గడ్డి మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రేగొండ, ఏప్రిల్ 11 : మండలంలోని రంగయ్యపల్లె గ్రామానికి చెందిన సూర సుధాకర్ రూపిరెడ్డిపల్లెలో గొర్రెల కాపరిగా జీతం ఉంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం పరకాల–భూపాలపల్లి ప్రధాన రోడ్డు దాటుతుండగా లారీ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సుధాకర్ తల, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో దవాఖానకు తరలించారు. సుధాకర్‌ను ఢీకొట్టిన లారీని గ్రామస్తులు వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సుధాకర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## కన్నకొడుకు కర్కశత్వం

**తల్లి అంత్యక్రియలకు దూరం, కూతుళ్లే నిర్వహించిన వైనం**

చిట్యాల, ఏప్రిల్ 11: నవ మాసాలు మోసి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచిన కొడుకే కర్కశుడిగా మారాడు. తల్లి మృతిచెందగా, ఆమె అంత్యక్రియలు చేయలేక తప్పించుకొని పారి పోయాడు. ఈ విషాదకర ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాకలో శుక్రవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. నైన్‌పాకకు చెందిన గోనెల రాధమ్మ(68)కు కుమారుడు ఓదెలు, పెద్ద కుమార్తె స్వరూప, చిన్న కుమార్తె వసంత ఉన్నారు. రాధమ్మ భర్త మల్లయ్య పదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆ తర్వాత వృద్ధాప్యంలో తల్లి చేరదీయాల్సిన కొడుకు పట్టించుకోవడం మానేశాడు. కొన్నేళ్ల క్రితం గొడవ పెట్టుకొని ఇంట్లో నుంచి పంపించేశాడు. దీంతో దిక్కులేకుండా ఆమె గ్రామంలో ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ కూలి పనులు చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్నది. గురువారం సాయంత్రం ఉపాధి పనులకు వెళ్లిన ఆమె కడుపులో నొప్పిగా ఉందని అక్కడే అస్వస్థతకు గురైంది. అక్కడే ఉపాధి పనిలో ఉన్న కొడుకు తనకేం తెలియదన్నట్లుగా ఇంటికి వెళ్లి పోయాడు. గ్రామస్తులే చిన్న కుమార్తె వసంతకు సమాచారం అందించి, ఆమెను భూపాలపల్లి జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న కొడుకు అతడి భార్య, కుమార్తెను గ్రామంలోనే వదిలి కుమారుడితో సహా పారిపోయాడు. గ్రామస్తులు అతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై శ్రావణ్‌కుమార్ చేరుకొని మృతురాలి కూతుళ్లతో మాట్లాడారు. చివరకు పెద్ద కుమార్తె అంత్యక్రియలు చేసేందుకు ఒప్పుకోవడంతో ముదిరాజ్ కులస్తులలో చేయి వేసి ఖర్చులు భరించారు. ఆమె చివరి మజిలీని పూర్తి చేశారు.